ఆంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కడ్తాల్, ఏప్రిల్ 6: మండల పరిధిలోని గాన్గుమార్ల తండా పంచాయతీలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠానోత్సవంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట టాస్క్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, వెంకటేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్ మోత్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు శంకర్, లక్ష్మణ్, శ్రీను, భీమన్, పవన్, సక్రు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కడ్తాల్, ఏప్రిల్ 6: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి చెందిన తుప్పరి రామకృష్ణగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆదివారం రామకృష్ణగౌడ్ మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన గుండెపోటుతో మృతి చెందిన బాలరాజుయాదవ్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌యాదవ్, నాయకులు శ్రీరాములుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కొమురయ్యయాదవ్, యాదగిరి, లక్ష్మీనారాయణ, విజయ్ ఉన్నారు.

నీరా తయారీ కేంద్రం సందర్శన

నీరా తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎక్సైజ్ శాఖ కర్నూల్ జిల్లా డివిజన్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కడ్తాల్, ఏప్రిల్ 6: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలోని నీరా తయారీ కేంద్రాన్ని ఆదివారం, ఎక్సైజ్ శాఖ కర్నూల్ జిల్లా డివిజన్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నీరా కేంద్రాన్ని ఎప్పుడు ప్రారంభించారు, నీరాను ఎంత ఉష్ణోగ్రతలో తయారు చేస్తున్నారు, ఉత్పత్తి, రవాణా తదితర విషయాలను నీరా సెంటర్ నిర్వాహకుడు సత్యం, సీఐ బద్యానాథ్ చౌహాన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చరికొండ గ్రామంలోని గీతా కార్మికులను నీరా తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ బాలు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని రాయపోల్ అంబేద్కర్ చైతన్య యోజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఆ సంఘం నాయకులు హనుమండల సురేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమండ్ల నవీన్‌కుమార్, ఉపాధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా సురేందర్, కోశాధికారి త్యాగరాజు, ప్రచార కార్యదర్శి తరుణ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా గంధోత్సవం

ఆమనగల్లు, ఏప్రిల్ 6: పట్టణంలో శనివారం రాత్రి హజ్రత్ సయ్యద్ జలాలోద్దీన్ షావాలి గంధోత్సవాన్ని పట్టణంలోని మైనార్టీ నాయకులు, యువకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీర్జా అలీబెగ్, సయ్యద్ ఖలీల్, యండి మౌజమ్, చాంద్‌పాషా ఇంటి నుంచి బయలుదేరిన గంధంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని పుర వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హజ్రత్ సయ్యద్ జలాలోద్దీన్ షావాలి దర్గా వద్ద గంధోత్సవాన్ని సమర్పించారు. మౌలానా అబ్దుల్ వాహిద్, మౌలానా కరీం ఆధ్వర్యంలో దువ్వ ప్రార్థనలు, సాలామ్ నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ మాసూమ్, జబ్బార్, జలాల్, బాబా, షర్ఫోద్దీన్, ఖాధర్ ఖాద్రీ పాల్గొన్నారు.

వేసవిలో చలి వేంద్రాలు దోహదం

యాచారం, ఏప్రిల్6: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏవీజీ ఫౌండేషన్ చైర్మన్ వరలక్ష్మి గణేష్ అన్నారు. మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మూడు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గణేశ్, మాజీ సర్పంచ్‌లు కృష్ణ, బాల్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప, మాజీ వార్డు సభ్యులు సురేశ్, బీఆర్ఎస్ నాయకులు మధు, సురేందర్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ జగన్, కారోబార్ రాము ఉన్నారు.

రోడ్డు పునరుద్ధరణకు మోక్షమెప్పుడో..?

- గత ప్రభుత్వంలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు విడుదల
- కంకర, గుంతల రోడ్డుతో తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- రోడ్డుకిరువైపులా మురుగునీరు ప్రవాహం
- చెత్తాచెదారం పారబోతతో దుర్గంధం
- త్వరగా పనులు చేపట్టి.. రోడ్డును వినియోగంలోకి తేవాలని వేడుకోలు

ఇబ్రహీంపట్నం బైపాస్‌రోడ్డు వెంట దర్శనమిస్తున్న చెత్తాచెదారం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 6 : ఇబ్రహీంపట్నం సాగర్‌రహదారికి అనుసంధానం చేస్తూ ఖానాపూర్ గేటు నుంచి కోహెడగేటు వరకు ఉన్న బైపాస్‌రోడ్డు నిర్మాణం కోసం ప్రయాణికులు, ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ రోడ్డులో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి, పూర్తిగా కంకరతేలటంతో ప్రయాణించేందుకు వీలుగా లేకుండా పోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి రూ.3కోట్ల హెచ్ఎండీఏ నుంచి నిధులు విడుదల చేయించారు. అప్పుడు ఎన్నికల కోడ్ రావటంతో ఈ పనులకు బ్రేక్ పడింది. అనంతరం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా ఈ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతాయని ఆశించినప్పటికీ అవి ముందుకు సాగటంలేదు. ఈ రోడ్డు అభివృద్ధి చెందితే ప్రయాణం కూడా సులభతరంగా మారుతోందని పేర్కొంటున్నారు. ఈ రోడ్డులో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో పాటు మురుగునీరు ప్రవాహం, కంకర తేలి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, ఈ రోడ్డుకిరువైపులా ఇబ్రహీంపట్నంలోని అన్ని వ్యర్థాలను తీసుకువచ్చి పారబోస్తుండటంతో దుర్గంధం వెదజల్లి జనం ఇబ్బందులకు గురవుతున్నారు.



ఇబ్రహీంపట్నం బైపాస్‌రోడ్డులో ప్రవహిస్తున్న మురుగునీరు..

రోడ్డుకిరువైపులా వెలుస్తున్న కాలనీలు..
ఇబ్రహీంపట్నం బైపాస్‌రోడ్డు సాగర్‌రహదారికి అనుసంధానంగా ఉండటంతో ఈ రోడ్డుకిరువైపులా ఇబ్రహీంపట్నం టౌన్‌లో కాలనీలు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నాయి. ఈ మార్గంలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్‌శాఖ ప్రత్యేక రోడ్డును వేసి మూడు పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలను నగరానికి తరలిస్తోంది. ఈ రోడ్డు కోహెడ ఎక్స్‌రోడ్డు వద్ద సాగర్ రహదారికి కలుస్తుండటంతో బైపాస్‌గా గుర్తింపు పొందింది. గతంలో సుమారు ఏడు కిలోమీటర్ల మేర నిర్మించిన మట్టి రోడ్లు ఇబ్రహీంపట్నం లోపలికి రాకుండా నాగన్‌పల్లి, ఖానాపూర్, పోల్కంపల్లి, దండుమైలారం, ముకునూరు, మంచాల మండలంలోని వివిధ గ్రామాలకు నిత్యం ప్రయాణం సాగించేవారికి ఈ లింకు రోడ్డుగా ఎంతో ఉపయోగపడుతోంది.

వ్యర్థాలతో భరించలేని దుర్గంధం..
ఇబ్రహీంపట్నం బైపాస్‌రోడ్డువెంట ఇబ్రహీంపట్నం కేంద్రంలోని హోటళ్లు, చికెన్‌సెంటర్లు, టిఫిన్‌సెంటర్లతో పాటు ఇతరత్రా వ్యాపార సముదాయాల్లో మిగిలిపోయిన వ్యర్థాలను తీసుకువచ్చి ఈ రోడ్డుకిరువైపులా పారబోస్తున్నారు. ఈ రోడ్డువెంట దుకాణ సముదాయాలు ఏర్పాటు చేయగా, వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలను పారబోసేవారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వ్యర్థాలు పారబోసే వారిపై చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం బైపాస్‌రోడ్డులో పట్నంలోని వ్యర్థాలన్నీ తీసుకువచ్చి ఇక్కడే పారబోస్తున్నారు. అలాగే, మురుగునీరు రోడ్డు వెంటనే ప్రయాణిస్తుండటంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు వెంట దుకాణ సముదాయాలు ఏర్పాటు అయ్యాయి. వ్యర్థాలు పారబోసే వారిపై చర్యలు తీసుకోవటంతో పాటు రోడ్డును వెంటనే పూర్తిచేయించాలి.

- నల్ల ప్రభాకర్, స్థానికుడు

బైపాస్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం ఖానాపూర్ గేటునుంచి కోహెడ గేటు వరకు ఉన్న బైపాస్‌రోడ్డును బీటీగా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణం కూడా మరింత సులభతరంగా మారనుంది. ప్రస్తుత ఎమ్మెల్యేతో పాటు అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తిచేయించాలి.

- గుంటి కిరణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం



ముడిమ్యాల్‌లోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

షాద్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను ఆశ్వీరదిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆయా గ్రామ, పట్టణాల్లోని పలు దేవాలయాల్లో సీతారాముల కల్యాణమహోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. చిన్నా పెద్ద తేడా లేకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. దీంతో ఆంజనేయస్వామి, శివాలయాలు, సీతారాముల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వారి సౌకర్యార్థం చలువ పందిళ్లు, టెంట్లను ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మండపాల వద్ద అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

-న్యూస్‌నెట్ వర్క్, నమస్తే తెలంగాణ

షాబాద్: సీతారాంపూర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి సతీమణి పట్నం సాన్విరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నంలోని ఎలిమినేడులో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో పాల్గొని తలంబ్రాలు పోస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ముకుందమ్మ దంపతులు

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

షాద్‌నగర్ పట్టణంలో సీతారాములపై తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

షాద్‌నగర్‌లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి హాజరై పట్టణవాసులు

రైతు ఆత్మహత్య

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 6 : ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండల పరిధి చిన్న శంకర్‌పల్లి గ్రామానికి చెందిన బద్దం హన్మంత్‌రెడ్డి (48) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమారులు అరవింద్‌రెడ్డి (23), ప్రణీత్‌రెడ్డి (21) ఉన్నారు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఇటీవల భార్య, కొడుకులతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఈనెల 4వ తేదీ శుక్రవారం భార్య అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు బద్దం హన్మంత్‌రెడ్డి చిన్న శంకరపల్లిలోని తన వ్యవసాయ భూమిలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరివేసుకుని మహిళ మృతి

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 6: ఓ వివాహిత ఇంట్లో ఫ్యాసుకు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఎస్సై శిరీష తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్న గోవిందగారి పురుషోత్తంరెడ్డికి గత రెండు సంవత్సరాల క్రితం నగరంలోని కాళీ మందిర్‌కు చెందిన తరుణి అలియాస్ యమునా (30) పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. కాగా, ఈ నెల 5వ తేదీన భర్తకు మూడు, నాలుగు సార్లు ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో క్షణికావేశంలో శనివారం రాత్రి 11గంటల సమయంలో ఇంట్లోని బెడ్‌రూంలోకి వెళ్లి గడియపెట్టుకుంది. కుటుంబ సభ్యులు ఎంతపిలిచినా తలుపులు తీయకపోవడంతో వాటిని ధ్వంసం చేసి లోపలికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కన్పించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలు తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

కళావతి (ఫైల్)

కొందుర్గు, ఏప్రిల్ 6: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన జిల్లేడు చౌదరిగూడ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన గోతూరి కళావతి(80) ఆదివారం మృతి చెందింది. కళావతి కూతురు మంజుల తన తల్లి మరణంపై అనుమానం ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కళావతి కుమారుడు ఎల్లారెడ్డి అతడి భార్య స్వరూప, కుమారుడు సుధాకర్‌రెడ్డిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఏఐటీయూసీ కార్యవర్గం

కడ్తాల్, ఏప్రిల్ 6: తలకొండపల్లి మండల కేంద్రంలో భవన నిర్మాణ సంఘం మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, ప్రధాన కార్యదర్శి కన్నయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాశేశంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా జయచందు, ప్రధాన కార్యదర్శులు కుమార్, శ్రీను, ఉపాధ్యక్షులుగా దీప్లానాయక్, బాలయ్య, శ్రీరాములు, వెంకటేశ్‌ను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. అనంతరం కార్యవర్గ సభ్యులను జిల్లా నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి ప్లాట్లను కాపాడాలి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 6: తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ సర్వే నెంబర్ 240, 241, 242లోని ప్లాట్లు తమకు చెందిన స్థలంలో ఉన్నాయని తమకు కోర్టు ఆర్డర్ ఉందంటూ పలువురు వ్యక్తులు తమ ప్లాట్లను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని కబ్జాదారులపై చర్యలు తీసుకొని తమ ప్లాట్లు కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరుతూ ఆదివారం ప్లాట్ల యజమానులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన మట్లాడుతూ ప్లాట్లు కబ్జాకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటామని, న్యాయ పరంగా పోరాటానికి సైతం సిద్ధంగా ఉండాలని ప్లాట్ల యజమానులకు సూచించారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని తెలిపారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే వ్యవసాయ భూమి కాకుండా పూర్తిస్థాయిలో ప్లాట్లు ఉన్న విషయాన్ని కోర్టుకు తెలియజేయాలని తెలిపారు. అనంతరం ఆయన వేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అయిలయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు